
## ఈ వారం కథ



# అనంతయ్య మరణం

– 'విధ్వంసి'

''నాన్నా కొంప మునిగింది'' అని కేకేశాడు రామం

''ఏమైందిరా'' అని ఆదుర్దాగా అడిగాడు అనంతయ్య

''మీ ముద్దుల చిన్నాడు వ్యభిచార గృహంలో పట్టుబడిపోయాడు.''

'నువ్వు చెప్పేది నిజమేనా'' షాక్ తిన్న అనంతయ్య ఆందోళనగా

''ఇంకా అనుమానమేమిటి? ఆ వెధవ చివరికి వ్యభిచారుల కొంపలో దొరికిపోయాడు. ఇదీ వీడు పట్నంలో వెలగబెట్టే నిర్వాకం.''

ఒక్కసారిగా అనంతయ్య కుప్పకూలిపోయాడు. మొహం మీద నీళ్లు చల్లారు. కాస్తంత స్పృహ రాగానే అనంతయ్య అడిగిన మొదటి ప్రశ్న ''ఈ సంగతి అందరికీ తెలిసిపోయిందా?''

''వెడెంత కాలం దాగుతుంది నాన్నా''

అనంతయ్య మూల్గాడు నీరసంగా ''ఐపోయింది, అంతా ఐపోయింది''

భూమి నుంచి మొత్తంగా తుడిచిపెట్టుకుపోతున్న ఒక పురాతన క్షుద్ర జీవజాతి అంతిమ అవశేషం అనంతయ్య. అతను పుట్టినప్పటి నుంచీ దేశంలో ఎన్నో చెప్పుకోదగ్గ మార్పులు వచ్చాయి. కాలం తీవ్ర సంక్షోభంలో పొంగి పొర్లిన సందర్భాలూ వున్నాయి. స్వాతంత్ర్య పోరాటం ఉవ్వెత్తున ఎగిసి పడ్తున్న కాలంలో అనంతయ్య యువకుడు. అతడొక చెరువు గట్టు మీద వుండగా స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ''అలాగా? ఐతే?'' అదీ అనంతయ్య ప్రతిస్పందన. ఊర్లోకి కరెంటు వచ్చింది. బస్సులొచ్చాయి. ప్రసార సాధనాలు వ్యాపించాయి. చైనా పాకిస్తాన్ యుద్ధాలు జరిగాయి. ఎన్నో యెన్నెన్నో జరిగాయి ఇంటా బయటా. 70 ఏళ్ళ జీవితం గడిచిపోయింది. అనంతయ్య 'అనంతయ్యే'-భగవద్గీతలో చెప్పినట్లు అతడు తాబేలులా ఇంద్రియాలనన్నిటినీ ముడుచుకుని జీవించాడు. కాలం తెచ్చే మార్పు ఆ పై డిప్పని కూడా తాకలేకపోయింది. అసలు అనంతయ్యకి ప్రతి చిన్న మార్పూ మహా పాపమే. కాలం పరిణామశీలమన్న వాస్తవం అవాస్తవమైంది. అనంతయ్య కాలం అతడు పుట్టిన చోటనే నిలిచిపోయింది.

ఇప్పుడు అనంతయ్య భయంకరమైన కల్లోలానికి గురయ్యాడు. దాని నుంచి ఏ దేవతలూ ఏ కర్మ సిద్ధాంతమూ అతనిని రక్షించలేకపోయాయి. 'రామా, కృష్ణా!' అనుకుంటూ కాటికి పోవలసిన వయసులో ఈ కర్మేమిటో' జ్వరగ్రస్త కంఠంతో మూల్గాడు అనంతయ్య

ఒకరోజు గుళ్ళోకెళ్ళి తిరిగి వస్తూ రామంతో అనంతయ్య ''ఆ పూజారి నన్నలా ఎందుకన్నాడు?''

''ఏమన్నాడు?''

''నెత్తి మీద శఠగోపం పెడ్తూ 'మీ కొడుకు దొమ్మరి గుడిసెలో పట్టుబడిపోయాట్ట కదా' అని అడగలేదూ?''

''లేదు. అలా అడగలేదు 'మీ చిన్నాడికి పెళ్ళెప్పుడు చేస్తారని అడిగాడంతే. మీరు భ్రమ పడుతున్నారు'' దాంతో అనంతయ్య మనస్థితి గురించి రామం భయం పట్టుకొంది.

అనంతయ్య గది కిటికీ తలుపులన్నీ మూసేశాడు. వెల్తురుకి కళ్ళు పొట్లు పెడ్తున్నాయి. మనుషుల మొహాల్ని చూస్తుంటే అనంతయ్యకి వాంతి వస్తోంది.

కటిక చీకట్లో పడుంటున్నాడు స్తబ్దంగా, వొంటి మీద పాకే బొద్దింకల్ని కూడా అదిలించకుండా! తిండి మాత్రం రెట్టింపైంది. ఇప్పుడు అతని భారీ కాయం మీద తలకాయ నిమ్మకాయలా వుంది. మంచం దిగడమే మానేశాడు. కాలకృత్యాలన్నీ మంచం మీదే. అనంతయ్య ఆవేశంతో "వెధవ ప్రపంచం.. దీన్ని తగలెయ్య. అంతా పోయింది, గౌరవం మర్యాదా, చంపెయ్యండి. వాణ్ణి చంపెయ్యండి" అని పిచ్చిగా అరిచేవాడు. "సన్యసం పుచ్చుకుంటా. అహం బ్రహ్మాస్మి" అంటూ బట్టలు విప్పేసి గెంతేవాడు. "ఈ వెధవ పల్లెటూర్లో నేనుండలేను. పైగా ఈ ముసలాడి పిచ్చొకటి. నా తల పగిలిపోతోంది" అంటూ విసుక్కునేది రామం భార్య.

"ఏం చేస్తాం చెప్పు. పరిస్థితి అలాంటిది. మనం ఈ పరిస్థితుల్లో విడిచి పెట్టి పోతే లోకం ఏమను కుంటుంది? తొందర్లోనే అంతా కుదుట పడ్తుంది" అని ఓదార్చాడు రామం

కానీ వారం రోజులైనా అనంతయ్య అలాగే వున్నాడు. అర్ధరాత్రి హఠాత్తుగా లేచి "సన్యాసం పుచ్చుకుంటా" అని పరిగెడ్తుంటే గదిలోకి నెట్టి తాళం వేయడం కష్టమయ్యేది. "ఆత్మానుభూతి కలిగినవాళ్ళు అలాగే ప్రవర్తిస్తారు" అన్నాడు అనంతయ్య ఆధ్యాత్మిక వారసుడొకడు. మరొకడా మాట కొట్టేస్తూ "బహుశా అది ఢాకినీ పిశాచం. హనుమద్భక్తులైన భూత వైద్యులే దాన్ని తరిమెయ్యగలరు. నా మిత్రుడొకడున్నాడు, పంపిస్తాను" అన్నాడు.

మర్నాడు ఖరీదైన ఆధునిక దుస్తులలో మెరిసిపోతూ బూట్లు టకటక లాడిస్తూ ఒకడొచ్చి తనని భూత వైద్యుడిగా పరిచయం చేసుకొన్నాడు ఇంగ్లీషులో. 'వీడు భూత వైద్యుడేమిటి' ఆశ్చర్యపోయాడు రామం. విభూతి, పెద్ద కుంకం బొట్టు, చేతిలో వేప కర్రతో చూస్తేనే భూతం దిగేలా గుండాలి కదా? భర్తనే ఇష్టం వచ్చినట్లు తిడ్తున్న తన తల్లికి వొక భూత వైద్యుడు కొరడాతో భూతాన్ని వదిలించిన సంఘటన గుర్తొచ్చింది. కానీ ఈ భూత వైద్యుడింత నాజూకుగా వున్నాడేమిటి? పిల్లలు కూడా భయపడరు వీణ్ణి చూసి, భూతాల సంగతి తర్వాత. ఆ భూత వైద్యుడు టీ తాగుతూ స్పీచ్ ఇచ్చాడు ఇంగ్లీషులో - "భూత వైద్యం కూడా వైద్యమే. సైంటిఫిక్‌గా నిరూపించవచ్చు. జార్జి బూన్‌స్టన్, జాక్సన్ భూత వైద్యం గురించి శాస్త్రీయంగా అద్భుతమైన గ్రంథాలు రాశారు. సంస్కృతంలో భేతాళ శర్మ, భూపాల శాస్త్రి రాసిన గ్రంథాలెలాగూ వున్నాయి. అసలు భూత వైద్యానికి కూడా ఎం.బి.బి.ఎస్.సి. కోర్సు ఎందుకు పెట్టకూడదూ? ఇండియన్ కల్చరంటే నిర్లక్ష్యం. ఇంత కాలానికి యూనివర్శిటీలో జ్యోతిష్యం కోర్సు ప్రవేశ పెడ్తున్నారట. మరి భూత వైద్యం? దాన్ని కూడా పెట్టి నాలాంటి స్కాలర్ని ప్రొఫెసర్‌ని చేస్తే..." భూతవైద్యం విశిష్టతని గురించి అనర్గళంగా మాట్లాడుతూ సంస్కృత శ్లోకాలు కూడా వల్లించడం మొదలు పెట్టాడు. "భగవద్గీతలో 'భూతానామస్మి చేతనా' 'భూతాలకి చైతన్యం నేనే' అని శ్రీకృష్ణుడనలేదూ' అంటూ భూతాల వునికిని గురించి భగవద్గీత ప్రమాణం కూడా చూపించాడు. దాంతో ముగ్ధుడైపోయాడు రామం. అర్థంతో పని లేదు. సంస్కృత శ్లోకం వినిపిస్తే చాలు మూర్ఛపోతాడు రామం అప్పుడు రామం "భూతవైద్యం కూడా హిందూ సంస్కృతికి అలంకారమే" అనుకున్నాడు.

చల్లని గాలి తెర కిటికీలోంచి చెంపల్ని తాకింది. భూత వైద్యుడు ఏదో వింటున్నట్టు చెవిని కిటికీ దగ్గర పెట్టి "హనుమంతుని సందేశం గాల్లో తేలొస్తోంది. హ్రోం హ్రూం హ్రీం ఢాకినీ పిశాచం"

స్నానించి వచ్చి భూతాల డాక్టర్ మొహానికి దట్టంగా విభూతి పులుముకున్నాడు. పెద్ద కుంకం బొట్టు పెట్టాడు. ముగ్గులేశాడు. చీకటి గది నుంచి అనంతయ్యని ముగ్గుల మధ్యకు లాక్కొచ్చారు. నాజూకు భూత వైద్యుడు అసలు రూపం బయట పెట్టాడు. కొరడా ఛళ్ ఛళ్‌మంది. 'ఢాకినీ శాకినీ హ్రోం హ్రీం హ్రూం పవనకుమార్" కొరడా దెబ్బలకి నాట్యం చేశాడు అనంతయ్య. "చంపెయ్, నన్ను చంపెయ్ లం... కొడకా, కొరడాకి సుఖరోగం, మా వంశానికే. నీయమ్మ..."

"ఇది క్షుద్రభూతం. బూతులు కూడా మాట్లాడ్తోంది" అన్నాడు భూత వైద్యుడు.

* * *

తలుపు తెరుస్తుండగా పొరపాటున లోపలికి చొరబడిన వెల్తుర్లో చింపిరి జుట్టు పిల్ల. "ఎవర్నువ్వు" అనంతయ్య అరుపుకి ఉలికిపడి ఆ అమ్మాయి "వెంకడి కూతుర్ని"

"లం.. నీచేత చేయిస్తున్నారటె, నన్ను పిచ్చివాణ్ణి చేసి. పిలు వాణ్ణి"

"అమ్మకి కూడా వొంట్లో బాగా లేదు"

"మరి నీ పెళ్లా మేం చేస్తోందిరా"

"ఈ చాకిరీ చేయలేనంటోంది"

"అనకేం చేస్తుంది నువ్వు చవటవైతే. నేనూ సంసారం చేశారా. ఇలాగా? ఆడదానికి కాస్తంత భయం కూడా వుండాలా"

> "ఈ ఇంటి మీద,
> మా మీద గౌరవం లేని
> వాడివి ఎందుకు
> తగలడ్డావ్?"
> "రావలసిన
> ఆస్తి కోసం..."

"నీ మీదామెకు ఏమాత్రం అభిమానం లేదు. ఆమె తండ్రినెప్పుడూ తిడ్తూ వచ్చావ్. ఇప్పుడు మీ చిన్న కొడుకు మాత్రం ఏం చేశాడని అడుగుతోంది"

"అడక్కేం చేస్తుంది? అలుసిస్తే! ఇప్పుడూ తిడ్తాను దాని తండ్రిని. తాగుబోతు వెధవ, ముండల మురికోరు, డబ్బు తప్ప గౌరవమూ మర్యాదా యేమీ తెలియని వెధవ"

"అంత ధర్మం తెలియని వాడి కూతుర్ని ఎందుకు చేసుకోమని పట్టుబట్టావ్? తాగి రోడ్డు మీద పడిపోతుంటాడని తెలియదా! ఆమె నక్షత్రం మంచిది కాదంటే శాంతులున్నాయన్నావ్. అంతక్రితం అదే నక్షత్రం కల అమ్మాయిని కాదన్నదీ నువ్వే. అసలు సంగతి డబ్బు. చివరి వరకు నిన్ను వాళ్ళ భుజాల మీద మోస్తారనుకున్నావ్. కొంచెం నిర్లక్ష్యం చేయగానే పాపాత్ములైపోయారు"

"ఔరా నీ సుఖం కోసమే డబ్బున్న అమ్మాయిని చూసి చేశాను. నీ అప్పటా ముప్పటా తీరుస్తారని. దరిద్రులకి ధర్మం, సంస్కారం వుంటాయని నమ్మకమేమిటి? పొట్ట కూటి కోసం నానా గడ్డీ తింటారు. పూర్వ జన్మ సుకృతం వల్ల నీ మావకి లక్షలాది ఆస్తి వారసత్వంగా వచ్చింది. ధర్మంగా వుంటారనుకున్నాను. నాలాంటి పండితుణ్ణి, ధర్మాత్ముణ్ణి, ఎంతోమంది ఐశ్వర్యవంతులు నా పాదాలు కడిగి నెత్తిమీద జల్లుకుంటార్రా. మీకేం తెలుసురా నా విలువ? నువ్వు కూడా నన్ను వెర్రి వెధవను చేసి దాన్ని ఇంట్లోకి లాక్కొచ్చావ్. నా పరువేమౌతుందిరా? వాడు వేశ్యల కొంపలో పట్టుబడిపోయి పరువు తీశాడు. నువ్విలా...

"ఆ పిల్ల మాత్రం మనిషి కాదా? కుక్కనీ అధమ జాతివాణ్ణీ పండితులు సమానంగా చూస్తారని గీతలో లేదా?"

"ఆత్మంతా వొకటేనని కుక్కకీ వంటింట్లో పీటేస్తావట్రా! నేను చెప్పిన భాష్యాల్ని నాకే ఇలా అప్పజెపుతున్నావా?"

"కాలంతో పాటు కొంతైనా మారాలి నాన్నా.

"పోరా వెధవా పో, నాకెవరితో సంబంధం లేదు. అంతా మిథ్య, రజ్జు సర్ప భ్రాంతి. నన్ను దేశంలోని ఆచార్యులందరూ నెత్తికెక్కించుకున్నారు. మీరెంతరా. పురుగులు, చీమలు. పొండి నాశనమై పొండి" పిచ్చి బలంతో రామ్మూర్తిని నెట్టి గడియ వేసేశాడు అనంతయ్య. భోర్లాపడుకుని ఏడవాలనుకున్నాడు. ఒక్క కన్నీటి చుక్క కూడా రాలేదు. అందరూ వెధవలే. కొడుకులూ కోడళ్ళూ కూతుళ్ళూ పూర్వం ఎలా వుండేవారు! ఋషుల్లా బతికారు! తను మాత్రం...! . . .

తండ్రి మాటని వేదంలా అనుసరించేవాడు కాదా? కానీ ఆస్తి కోసం తలకాయని గోడకి... అలా తండ్రిని కూడా ఎదిరించి ఆస్తిని నిలిపింది ఈ వెధవల కోసమే కదా? తన చెల్లెలు మాత్రం పెళ్లైన రెండు నెలలకే

మొగుడు చస్తే, గుండు గొరిగించుకుని మూల కూర్చుంది. కానీ ఈ కాలపు ...ల్లా...! పెంట కుప్ప మీద శిశువు శవం. దాంతో తన కుటుంబానికేం సంబంధం లేదు. ఏమీ లేదు. అంతా భ్రాంతి. తన తండ్రి వేదం చదువుతుంటే దేవతలు దిగొచ్చేవారు.

ఛీఛీ అంతా కల. తన కూతురికి చిన్నతనంలోనే శాస్త్రోక్తంగా పెళ్ళి. 13 ఏళ్ళకే కడుపు, పిచ్చి. అంతా కర్మ, అంతా భగవల్లీల. ఎంత వెనక్కి వెళ్ళగలిగితే అంత వెనక్కి. అన్నీ అపశ్రుతులే. వేసిన ప్రతి అడుగూ తప్పటడుగే. సమాజంలో అందరికీ వున్న బొక్కలే తనకీ తన వంశానికీ. కానీ తన వంశంలో అందరూ గుట్టుగా, గౌరవంగా, మర్యాదగా బతికారు. ఈ వెధవల్లా మెళ్ళో ఎముక లేసుకుని తిరగలేదు. గౌరవంగా, మర్యాదగా, గుట్టుగా...! అవే అలవాటు పడ్డ పదాలు మళ్ళీ మళ్ళీ వుచ్చరించాడు. ఆత్మరతిలోని ఆనందం కలిగింది. కానీ ఆ పవిత్ర పదాల మధ్య తన కొడుకు వ్యభిచారిణితో పట్టుబడిపోయాడు. అబద్ధం, అబద్ధం, అబద్ధం, అబద్ధం, భ్రాంతి అని ఎన్నిసార్లు అరచినా ఆ నిజం అలాగే నిలిచి వుంది. ఈ పెద్దాడు మాత్రం ఏం మర్యాద నిలబెట్టాడు?

అందరూ వెధవలే! అహం బ్రహ్మాస్మి.

నిర్గుణం దుర్. నిరంజన్ దుర్ దుర్. నిర్లిప్తం దుర్, దుర్, దుర్... గదంతా దుర్గంధం. ఔను. ఆ కటిక చీకట్లో అంతా నిర్గుణమే. ఆ చీకటి అతనికి చాలా హాయినిచ్చింది. దేన్నీ చూడనక్కర లేదు, ఎవరితోనూ మాట్లాడక్కర్లేదు. అహం బ్రహ్మాస్మి. ఎవరెలా చచ్చినా నాకేం? ఎవరి కర్మకు వాళ్ళే పోతారు. కాతే కాంతా కస్తే పుత్రః?

భార్య కెవ్వుమని అరవడంతో మంచం మీద పక్కకు దొర్లాడు రామం. అప్పుడు చూశాడు, దూలానికి వేళ్లాడుతున్న గబ్బిలాల మాలని. వాటి నల్లని రెక్కల నీడలు అతని మొహం మీద ప్రసరించాయి. కొన్ని క్షణాలు అతని బుర్ర స్తంభించి పోయింది. "ఐపోయిందా, అంతా ఐపోయిందా? ఈ ఇల్లు శిథిలమై నేల మట్టమై పోతుందా? తర తరాల సంప్రదాయాలతో, పవిత్ర గ్రంథాలతో పూర్వపు గౌరవ మర్యాదలతో సహా రేపటికేమీ మిగలదా?" గబ్బిలాలు పరిహాసంగా రెక్కలాడిస్తున్నాయి. అతని ముఖంపై మృత్యు భయం తచ్చాడింది. అతనా భయం నుంచి విముక్తి కోసం శ్లోకాలనీ మంత్రాలనీ గుర్తుకు తెచ్చుకొందుకు బ్రహ్మ ప్రయత్నం చేశాడు. కాని ఫలితం శూన్యం. మృత్యు భయంతో అన్నీ కొట్టుకుపోయాయి. దైవదత్తమైన అతని ప్రతిభ ఆ క్షణంలో పూర్తిగా పూడుకు పోయింది. మృత్యువు మరింత సన్నిహితమవుతున్న ఆందోళన. అతడొక్కసారిగా మంచం మీంచి చావు ముందటి ఆదిమోద్రేకంతో దూకి కర్రతో ఆ గబ్బిలాలని తరమాలని ప్రయత్నించాడు. కానీ అవి ఆ గదిలోనే చక్కెర్లు కొట్టడం మొదలు పెట్టాయి. ఆ పవిత్ర గృహపు శైథిల్యాన్ని మళ్ళీ మళ్ళీ గుర్తుకు తెస్తూ.. హఠాత్తుగా వులికిపడి లేచాడు రామం. "ఇది కలా నిజమా?"

అనంతయ్య తలుపులు మూసేసి వొక రోజైంది. ఎన్నిసార్లు పిలిచినా పలకలేదింత వరకూ. "కడుపు కాలితే ఆయనే తెరుస్తారు" అన్న కోడలి మాట వమ్మైంది. రామంకి సందేహం వచ్చి తలుపులు గట్టిగా మోదాడు. లోపలి నుంచి సమాధానం లేదు. చివరికి తలుపులు బద్దలు కొట్టాడు. హఠాత్తుగా ఆ చీకటి గది గందర గోళంపైన వెల్తురు ప్రసరించింది. ప్రాచీన గ్రంథాలన్నీ కాగితాలెగిరిపోతూ చెల్లా చెదురుగా, చెద తినేసిన తాళపత్ర గ్రంథాలు, పగిలిపోయిన పితాధిపతుల, దేవతల పటాలు, సీసం పెంకులు, స్వైర విహారం చేస్తున్న బొద్దింకలు. ఒక శిథిల భాష్యం కింద బొద్దింక చచ్చి పడుంది. ఆ గదే మరణ వేదనతో గింజుకున్నట్టుంది. ఆ గందరగోళపు గది మధ్యలో వొక వికృత సరీసృప కళేబరం. ఒక్కసారి అడుగు వెనక్కేసి కెవ్వున అరిచాడు. క్షణం తర్వాత షాక్



నుంచి తేరుకున్న రామ్మూర్తి విషాదంతో కుంగిన స్వరంతో మూల్గాడు. "భగవాన్ ఎంత వికృతమైన మరణం?" తనకి కూడా మృత్యువు సంక్రమిస్తోందన్న భయంతో వణికి పోయాడు. "వద్దు. వద్దు" అంటూ ఏడ్చాడు. తర్వాత జీవ శాస్త్రజ్ఞునిగా ఈ పరిణామం అతనికి ఉత్కంఠని కలిగించింది. 'జీవ పరిణామం అంత వెనక్కెలా తిరిగింది?" కాని మరుక్షణం కుటుంబ గౌరవం, మర్యాద, అతనిలోని శాస్త్రజ్ఞుణ్ణి నోరు మూయించాయి. ఎవరైనా చూస్తే? రెండు పెద్ద పంచెలు ఆ కళేబరం నిండా కప్పేసి, 'హమ్మయ్య' అని నిట్టూర్చాడు.

కర్మకాండ వైభవంగా జరిగింది. చాలా మంది పెద్ద మనుషులు వచ్చారు. డబ్బు కూడా ఇచ్చారు. ఎంతైనా రామ్మూర్తికి 10 వేల వేలి చమురు వదిలింది. అతని భార్య విసుక్కుంది కూడా. అందరూ రామ్మూర్తిని మెచ్చుకున్నారు. పెద్ద సైంటిస్టై కూడా తండ్రి తద్దినం వైభవంగా జరిపాడని, మంచి దక్షిణ లిచ్చాడని అనంతయ్య మరణం ముగిసి వారం రోజులైంది. రామ్మూర్తికి వుత్తరం వచ్చింది తమ్ముడి నుంచి.

"నాన్నగారి మరణం గురించి నాకు తెలియ వేయడం మానేసి మీ పరువునీ మర్యాదనీ నిలువు కున్నారు. ఆయన బతికున్నంత కాలం తనకి శాస్త్రోక్తంగా ఘనంగా కర్మకాండ జరుగుతుందో లేదోనని బెంగ పెట్టుకున్నాడు. ఆయన ఆత్మకి శాంతి కలిగించావు నువ్వు. ఆయన మరణాన్ని గురించి నేనేమీ విచారించడం లేదు. దొంగ మర్యాదలూ పరువు ప్రతిష్టలూ పేక మేడల్లా కూలి ఆయన చచ్చి పోయాడు. ఆయన మరణం మరెలా వుంటుంది? అందులో నా ప్రమేయం యాదృచ్ఛికం. కానీ అనంతయ్య అంతిమ క్షణాల అంతరంగాన్ని రికార్డు చేసే పరికరం ఏదైనా వుంటే ఎంతబాగుణ్ను? అన్ని రకాల మార్పునీ వ్యతిరేకించే 'పవిత్ర క్షుద్రజీవి' అవసానం ఎంత భయంకరమో భవిష్యత్తరాల వారికి హెచ్చరికగా వుండేది. పరిసరాల కేషమాత్రం స్పందించని జీవి పర్యవసానమది. మిగిలిన వారి నుంచి మనని వేరు చేసుకునేందుకు ఏర్పరచుకున్న ప్రత్యేక పవిత్ర అవ లక్షణాలు చావుకే రహదార్లు. డైనోసరస్ లాంటి భారీ కాయాలు భూమి నుంచి ఎలా అంతరించాయో నీకు తెలుసు. మితిమీరిన ప్రత్యేకతల ఫలితం ప్రతి ష్టంభన, వినాశనాలే కదా?

సరే దహనం కూడా ఐపోయుంది కదా? కాని అనంతయ్య మరణం పునరావృత్తం కాకూడదు. మనం అనంతయ్య అతని వ్యర్థ వేదాంతాన్నీ ఇంగ్లీషులోకి తర్జుమా చేసుకుంటూ, కుళ్ళు సంప్రదాయాలతో, తంతులతో, సాటి మనిషిపై ఏవగింపులతో, అహం బ్రహ్మాస్మి అహంకారంతో బతుకీడిస్తే, మన చావు అంతకన్నా భయంకరంగా వుంటుంది. అనంతయ్య బతుకుకి ప్రతిబింబమే అతని చావు కూడా. తరాల పాటు ఏ మార్పూ లేకుండా ఎందుకిలా బతుకు తున్నాం? మన కంపు ఇంపనుకొంటూ! లోపల చూస్తే అంతా డొల్ల. ప్రేమ లేదు. అవగాహన లేదు. ఒకరికీ మరొకరికీ వంతెనలు లేవు. తంతులు


తలనొప్పా?



ఘటాఫట్+ విముక్తి
ఆస్ప్రో

మీ ఇంట్లో, ఆఫీసులో
లేక ప్రయాణాల్లో....
ఎల్లప్పుడూ మీ
మందుల డబ్బాలో
ఆస్ప్రో.
ఉంచుకోవటం



ఎన్నడూ మరువకండి.
ఎందుకంటే
ఆస్ప్రో
తలనొప్పి
నుండి ఘటాఫట్
విముక్తినిస్తుంది.

ఆస్ప్రో
యావత్ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన ఉపాయం

Mudra: B: A: 709: TL


పెళ్ళిళ్ళు, బారసాలలు, మంత్రాలు తంత్రాలు, విరు నవ్వులు పులుముకున్న ముఖాలు, చచ్చు నీతులు, అందమైన మాటలు. ఏం పిండుకొన్నాం తరతరాలుగా ఈ వెధవ బతుకునుంచీ, ఈ సిఫిలిస్ వారసత్వం నుంచీ నాన్నగారు అమ్మకీ ఇష్టాలుంటాయనే విష యాన్ని ఎప్పుడైనా పట్టించుకొన్నారా? ఆమెను మనిషిగా ఏనాడైనా చూశారా? సారం పిండుకొని పిప్పిని చేశారు. అయినా వేదాంతాలూ, సిద్ధాంతాలూ ఆయనని పశ్చాత్తాప భారం కింద నలిగి చావకుండా ఇంత కాలం రక్షించాయి. నువ్వూ నాన్నగారి కళ్ళతోనే ఎన్నుకున్నావ్ డబ్బునీ కులాన్నీ ఎగాదిగా చూసి. డబ్బుతో పాటు ఆమె వెంట వచ్చిన అహంకారాన్ని మింగలేక కక్కలేక ఇప్పుడేడుస్తావ్. ఔను. పైపైన మన జీవితాలు మిరిమిట్లు గొల్పుతూండవచ్చు. మనం మంచి ఉద్యోగం వల్ల, ధన సంపాదన వల్ల, 'పాండిత్యం' వల్ల అందరినీ అలరించవచ్చు. కానీ అట్టడుగున ఎలా వున్నాం? మనకి రాముడెందుకా దర్శమయ్యాడు? పెద్ద మనుషుల మెప్పుకోసం, దొంగ గౌరవాల కోసం, పెళ్ళాం సెక్స్ నీతిని పరీక్షకు పెట్టడానికి కూడా సిగ్గుండదు వాడికి. కారడవుల్లో ఒక అమాయక నిమ్న జాతివాడు లోకరీతిని అతిక్రమించి తపస్సు చేస్తున్నాడని ఖూనీ చేశాడు. అలాగే మనం కూడా కుళ్ళు పెద్ద మనుషుల మెప్పు కోసం, పనికి మాలిన లోక మర్యాదల కోసం, స్వార్థం కోసం మన అంతరాత్మల్ని పూడ్చిపెట్టేసి బలికేస్తున్నాం. ప్రతీ ప్రగతికరమైన [illegible]నికీ ఎద్దుల్లా అడ్డుపడ్తున్నాం దాన్నే మనం 'సంస్కృతి' అని ముద్దుగా పిలుస్తున్నాం. ఈ సంస్కృతే నన్నువిసుగెత్తించింది. అక్కయ్యకి పిచ్చెక్కించింది. అత్తయ్య జీవితాన్ని నాశనం చేసింది. అమ్మని గొడ్డులా తయారు చేసింది. మనిషి మీద విశ్వాసాన్నీ, సృజనాత్మకతని, గాలినీ, వెల్తురునీ దూరం చేసింది. ఆ శిథిల పవిత్ర గృహపు నీడ నా జీవితం పొడవునా పరచుకొని నిరాశని నింపేసింది. లక్ష్యం లేకుండా చేసింది. నేనా నీడ నుంచి తప్పించుకోవడం కోసం లక్ష్య రహితమైన నా జీవితాన్ని ఇష్ట మొచ్చినట్టు పరిగెత్తించాను. వ్యర్థమైన పరుగు. మత్తు మందుల కలవాటు పడ్డాను. వేశ్యల పక్కల్లో నిద్దరాని రాత్రులు గడిపాను. కానీ యివేవీ నా నిర్లక్ష్య వ్యర్థ జీవితాన్ని ఉత్తేజవంతం చేయలేకపోయాయి. దీనికంతటికీ ఆ శిథిల గృహపు నీడే కారణం. ఔను. నేను దారి తప్పిపోయాను. మీరూ తప్పిపోయారు. మీరు ఆమోదయోగ్యమైన జీవితంలో తేలారు. నేను వ్యభిచార గృహంలో తేలాను. మీకు వేదాంతం, నాకు గంజాయి. మీకు పవిత్రమైన ముసుగు లున్నాయి. నాకు లేవు. అంతే తేడా. నేనా శిథిల పవిత్ర గృహానికి చివరి సారిగా వస్తాను తొందర్లో".

ఇంటికి వచ్చిన తమ్ముడికి గుమ్మంలోనే అడ్డుపడ్డాడు రామ్మూర్తి. "ఈ ఇంటి మీదా మా మీదా అంత గౌరవం లేని వాడివి ఎందుకు తగలడ్డావ్?"

తక్కున సమాధానం "నాకు రావలసిన ఆస్తి గురించి."